# విపశ్యన మాసపత్రిక

VOLUME : 21 NO - 12 1 MARCH, 2019

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70

**"ధర్మవాణి"**

*చరన్తి బాలా దుమ్మేధా, అమిత్తేనేవ అత్తనా !*
*కరన్తో పాపకం కమ్మం, యం హోతి కటుకప్ఫలం !!*

*– ధమ్మపద పాళీ – 66, బాలవగ్గో*

మందబుద్ధిగల మూర్ఖులు తమకి తమనే శత్రువులుగా మార్చుకొనే పనులు చేస్తారు. స్వయానా తమకే దుష్ఫలితం కలిగించుకొనే పాపపు పనులు చేస్తారు...

# బుద్ధుని బోధనలేమిటి?

**(1951 సంవత్సరంలో సయాజీ ఊ బాఖిన్ గారు బర్మాదేశపు అకౌంటెంట్ జనరల్‌గా ఉన్న సమయంలో అమెరికా దేశ ప్రభుత్వపు ప్రత్యేక సాంకేతిక మరియు ఆర్థికశాఖలోని సమాచార మరియు ఆర్థిక అధికారిచే నిర్వహింపబడిన ఒక ధర్మ అధ్యయన కార్యక్రమంలో ప్రసంగించడానికి సయాజీ ఊ బాఖిన్ గారు ఆహ్వానింపబడ్డారు. ఆ కార్యక్రమంలో సయాజీగారు మూడు ప్రసంగాలు చేశారు. రంగూన్‌లోని సిగ్నల్ పగోడా రోడ్డులో కల మెథడిస్ట్ చర్చిలో ఈ కార్యక్రమం జరిగింది. ఆ ప్రసంగాలు తర్వాతికాలంలో "బౌద్ధం అంటే ఏమిటి?" అనే ఒక చిన్నపుస్తకంగా ప్రచురించబడ్డాయి. వాటిని సంక్షిప్తంగా క్రమ సంఖ్యలో ఇక్కడ ప్రచురిస్తున్నాం)**

## మొదటి ప్రవచనం – మొదటి భాగం

**"బుద్ధుని బోధనలేమిటి?"** – అనే అంశం మీద మీ అందరి సమక్షంలో ప్రసంగించే అవకాశం నాకు దొరకటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. నిజం చెప్పాలంటే నేను ఏ విశ్వవిద్యాలయానికీ వెళ్లి చదువుకోలేదు. విజ్ఞాన శాస్త్రంలో చదువురాని ఒక మామూలు మనిషికి ఉన్నంత జ్ఞానమే నాకూ ఉంది. నేను బుద్ధుని బోధనల సిద్ధాంతాలలో పండితుణ్ణి కూడా కాను. అలాగే నాకు బుద్ధుని బోధనలను పొందుపరచిన తిపిటకాలను అర్థంచేసుకొనేంత పాళీ భాషాపరిజ్ఞానం కూడా లేదు. కొంతమంది విద్వాంసులైన భిక్షువులు బర్మీభాషలో రాసిన కొన్ని టీకాలను (అధ్యాయాలు) మాత్రమే నేను చదివాను. అయితే బుద్ధుని శిక్షణలను సైద్ధాంతికపక్షంగా కాకుండా అభ్యాసపరంగా ఎక్కువగా అర్థంచేసుకున్నాను కాబట్టి, ఈ రోజు నేను మీకిచ్చే సమాచారం మీకు అంత సులభంగా బయట లభించేది కాదని అనుకుంటున్నాను. అలాగే, ప్రస్తుతానికి నేను మాత్రం ప్రకృతి నియమాలను, బుద్ధుని బోధనల ఆధారంగా ఆచరణపూర్వకంగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్న విద్యార్థినే అనే సత్యాన్ని కూడా స్వీకరించాలి. నేను ఒక గృహస్థుడిని అవటంతోపాటు, ఉన్నత పదవిలో ఉన్న ఒక ప్రభుత్వ అధికారిగా నాకున్న బాధ్యతల వలన, నాకున్న అతి తక్కువ సమయం కారణంగా నా ప్రగతి ఎంతో నెమ్మదిగా ఉంది. కాబట్టి నేను చెప్పేదే సరైనదని కూడా నేను వాదించలేను. నేను చెప్పేది సరైనదే కావచ్చు, లేదా కాకపోనూవచ్చు. కానీ నేను ఏదైనా ఒక విషయం చెబుతున్నానంటే, అది చిత్తశుద్ధితోనూ, సద్భావనతోనూ, దృఢవిశ్వాసంతోనూ చెబుతున్నదే!

బుద్ధభగవానుడు **కాలామ సుత్త**లో ఈ విధంగా చెప్పారు.

**"మీరు ఒక విషయాన్ని విన్నాం కదా అని నమ్మవద్దు; తరతరాలుగా వస్తున్న సాంప్రదాయాలు కదా అని నమ్మవద్దు; చాలమంది అలాగే అనుకుంటున్నారు, అలాగే మాట్లాడుకుంటున్నారు కదా అని నమ్మవద్దు; పూర్వకాలపు ఒక ఋషీశ్వరుడు వ్రాసిన విషయం కదా అని నమ్మవద్దు; ఊహాలను, భావాలను నమ్మవద్దు; అలవాటు కారణంగా 'రాగం' కల్పించుకున్నావు కాబట్టి, అదే నిజమని నమ్మవద్దు; మీ గురువుల, పెద్దల పెత్తనం కారణంగా నమ్మవద్దు; జాగ్రత్తగా పరీక్షించి, విశ్లేషించి, అది తర్కబద్ధంగా ఉన్నదనీ, అందరికీ మంచిని, మేలును చేకూర్చుతుందనీ అనుకుంటే...అప్పుడు దానిని స్వీకరించు. స్వీకరించటమే కాదు...ఆచరించు!"**

కాబట్టే, నేను ఇక్కడ చెప్పబోయే దార్శనిక సిద్ధాంతాలు – మీకు తర్క సమ్మతమైనవీ, ఆచరించదగినవీ అని అనిపిస్తేనే వాటిని నమ్మండి!

*"సబ్బ పాపస్స అకరణం, కుసలస్స ఉపసమ్పదా !*
*సచిత్త పరియోదపనం, ఏతం బుద్ధాన సాసనం !!"*

**ఏవిధమైన పాపకర్మలూ చేయకపోవటం, కుశల (పుణ్య)కర్మలను పెంపొందించుకోవటం మరియు తన చిత్తాన్ని నిర్మలం చేసుకోవటం – ఇదే బుద్ధులందరూ బోధించే శిక్షణ...**

ధమ్మపద (ధర్మపథం) నుండి గ్రహింపబడిన ఈ పద్యమే, క్లుప్తంగా బుద్ధుని బోధన యొక్క సారాంశం. ఇదెంతో సరళంగా అనిపించినా, ఆచరణలో ఎంతో కఠినమైనది. బుద్ధుని బోధనలు పాటించకుండా, మీరు నిజమైన సుశిక్షితులు కాలేరు. బుద్ధుడు ఈ విధంగా చెప్పారు...

***"ఏ సత్యాలనయితే నేను స్వయంగా సాక్షాత్కారం చేసుకున్నానో వాటినే మీకు చెప్పాను. వాటిని మీ సత్యాలుగా చేసుకోండి, సాధన చేయండి, వాటిని ధ్యానం చేయండి! ఈ సద్ధర్మాన్ని దేవతలు, మనుష్యుల హితసుఖాల కొరకు చిరకాలం నిలిచి ఉండేలా వాటిని ప్రసరింపజేయండి!"***

బుద్ధుని ధర్మానికి పునాదిరాళ్లు అయిన ఆయన బోధనల గురించి మాట్లాడేముందు మీకు గౌతమ బుద్ధుని జీవిత కథను పరిచయం చేయాలనుకుంటున్నాను. బుద్ధధర్మంలోని ఎన్నో అంశాలు మీలో ఎంతోమందికి కొత్తగా అనిపించవచ్చు. కాబట్టి, ముందుగా బుద్ధుని బోధనలలోని కొన్ని విషయాలైన విశ్వము, బ్రహ్మాండము, వివిధ లోకాలు మొదలయినవాటిని వివరించాల్సిన బాధ్యన నాపై ఉంది. వీటితో మీ మెదడుకు కొంత మేత దొరుకుతుంది. కాబట్టి, మొదటగా మీరు వీటన్నింటినీ శాంతంగా విని, ప్రవచనం పూర్తయిన తరువాత ప్రశ్నోత్తరాల సమయం వచ్చేవరకూ వేచి ఉండాలని మనవి చేస్తున్నాను.

## విశ్వం :

బుద్ధుని బోధనలలో విశ్వాన్ని గురించిన ప్రస్తావన ఈవిధంగా ఉంది :

ముందుగా ***ఓకాస లోక*** (ఆకాశలోకం) లో నామ (మనసు) మరియు రూప (శరీరం)లు ఉంటాయి. ఈ లౌకిక ప్రపంచంలో కార్య–కారణ ధర్మంప్రకారం ఈ నామ–రూపాలే ప్రధానమైనవి. ఆ తరువాత లోకం ***సంఖారలోక*** (చిత్తవృత్తులు–చేతనలలోకం). ఇది మనసు చేత సృష్టించబడినది లేదా సృష్టించబడగలిగేది. మనోవాక్కాయ కర్మల ఆధారంగా మనసుయొక్క సృజనాత్మక శక్తులచేత, ఈ మనోలోకం తయారవుతుంది. ఇక ఆఖరిది, చివరి లోకం ***సత్త లోక*** (సత్తలోకం, ప్రాణుల లోకం). ఈ లోకంలోని ప్రాణులు మానసిక శక్తులద్వారా ఉత్పత్తి చెందినవే. ఈ మూడు లోకాలూ ఒకదాని నుండి మరొకటి విడదీయలేనివి. అంటే ఒకదానిలో ఒకటి ఇమిడి ఉన్నాయి. కాబట్టి ఈ మూడూ ఒకదానికొకటి అల్లుకున్న, ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న లోకాలు.

ఇక మరో ఆసక్తికర విషయం ఏమిటంటే, ***చక్కవాల*** (చక్రవాలం – అంటే బ్రహ్మాండం యొక్క పరిధి). దీనిని గురించిన వ్యాఖ్య మీకు ఎంతో ఆసక్తికరంగా అనిపించవచ్చు. ప్రతి ఒక్క చక్రవాలంలోనూ 31 లోకాలు ఉంటాయి. ప్రతి చక్రవాలంలోనూ మానవజగత్తులో వలెనే, తనదైన సౌరమండలం, ఇతర లోకాలు ఉంటాయి. ఇలాంటి చక్రవాలాలు కోటానుకోట్లు, నిజానికి లెక్కలేనన్ని ఉన్నాయి. మనకు దగ్గరగా ఉన్న పదివేల చక్రవాలాలు బుద్ధుని ***జాతిఖేత్త*** (జన్మ క్షేత్రం)లో ఉన్నాయి. భగాన్ గౌతమ బుద్ధుడు కపిలవస్తు నగరానికి దగ్గరలోని మహావనంలో సుప్రసిద్ధ ***మహాసమయ సుత్త*** ను బోధించినప్పుడు, కేవలం మన చక్రవాలంనుండే కాకుండా పదివేల చక్రవాలాల్లోని దేవతలు–బ్రహ్మలు ధర్మాన్ని వినటానికి విచ్చేశారు. బుద్ధుడు తన అనంత కరుణ, అనంత మైత్రీ తరంగాలను వందకోట్ల చక్రవాలాల లోని ప్రాణులపై ప్రసరింపచేయగలడు. దీనిని ***అణాఖేత్త*** (ఆజ్ఞా క్షేత్రం) అంటే ప్రభావ క్షేత్రం అని పిలుస్తారు. ఇక మిగిలిన చక్రవాలాలు విసయ ఖేత్త లో ఉన్నాయి. వాటిపై బుద్ధుని మానసిక తరంగాలు ప్రసరించలేవు. బుద్ధుని బోధనలలోని ఈ అంశాలతో ఈ విశ్వం ఎంత పెద్దదో మీరు అంచనా వేయవచ్చు. చూశారా! ఈ అనంత ***ఓకాస లోక*** లో (విశ్వంలో) మన ఈ ప్రపంచం ఎంత చిన్నదో, ఏంత సూక్ష్మమైనదో, అంతులేని విశ్వంలో ఉన్న ఒక చిన్న ధూళి కణంలాంటిది మన మానవ ప్రపంచం.

ఇక ఇప్పుడు మీకు ఈ చక్రవాలాల్లోని మూడు లోకాలు మరియు 31 భువనాలను పరిచయం చేస్తాను. ప్రతి చక్రవాలంలోనూ ఇలాంటి లోకాలు, భువనాలే ఉంటాయి. అవి స్థూలంగా....

1. ***అరూప లోక*** – భౌతిక పదార్థమే లేని మనోమమ బ్రహ్మలోకం
2. ***రూప లోక*** – సూక్ష్మభౌతిక పదార్థ బ్రహ్మలోకం
3. ***కామ లోక*** – దేవతలు, మానవులు మరియు ఇతర నిమ్నజాతి ప్రాణుల ఇంద్రియ లోకం లేదా కామలోకం.

1. ***అరూప లోక*** లో నాలుగు బ్రహ్మ భువనాలు (లోకాలు) ఉంటాయి. ఈ భువనాలు భౌతిక పదార్థాలతో కాకుండా, కేవలం నామ అంటే చిత్తంతో తయారవుతాయి.

2. ***రూప లోక*** లో 16 బ్రహ్మ భువనాలు (లోకాలు) ఉంటాయి. ఇవి అత్యంత సూక్ష్మమైన భౌతిక పదార్థాలతో తయారై ఉంటాయి.

3. ***కామ లోక*** లో ఈ క్రింది లోకాలు ఉంటాయి :

అ. ఆరు దేవలోకాలు ఉంటాయి. అవి ***1. చాతుమ్మహారాజిక, 2 తావతింస (తయంతింస), 3. యామ, 4. తుసిత, 5. నిర్మాణ రతి, 6. పరినిమ్మిత వసవత్తి.***

ఆ. *మానవలోకం*

ఇ. నాలుగు అథోలోకాలు (క్రింది లోకాలు) ఉంటాయి. అవి.... ***1. నిరయ*** (నరకం), ***2. తిరిచ్ఛాన*** (పశు పక్ష్యాదుల లోకం), ***3. పేత*** (ప్రేతప్రాణుల లోకం), ***4. అసుర*** (రాక్షసలోకం)

చిత్తశరీరాల మానసిక కర్మల కార్య–శృంఖలంలో ఏ సమయంలో ఎలాంటి మనోచేతన కలిగితే, ఆ సమయంలో మనసు అలాంటి మనోవృత్తులనే అనుసరిస్తుంది, వాటికి తగినట్లుగానే ఆయాలోకాలకు చెందిన తరంగాలతో సమరసమవుతుంది. ఈ లోకాలు శుద్ధమైనవి లేదా అశుద్ధమైనవి, చల్లనివి లేదా వేడివి, ప్రకాశవంతమైనవి లేదా అంధకారమయమైనవి, సుఖవంతమైనవి లేదా దుఃఖవంతమైనవి, తేలికైనవి లేదా బరువైనవిగా ఉండవచ్చు. ఉదాహరణకు, తన అనంత కరుణ, ప్రేమలను ప్రాణికోటి మీదంటా ప్రసరించగలగిన ఒక ధార్మిక

వ్యక్తిని తీసుకుందాం. అతడు అలా చేస్తూ శుద్ధమైన, చల్లని, ప్రకాశవంతమైన, సుఖమయమైన మరియు తేలికైన తరంగాలను జనింపజేస్తాడు. ఇలాంటి తరంగాలు సాధారణంగా బ్రహ్మలోకానికి తీసుకు వెళ్లేవిగా ఉంటాయి. మరోవైపు దీనికి వ్యతిరేకమయిన గుణ-ధర్మాలు కలిగి ఉండి, అసంతృప్తితో లేదా కోపంగా ఉండే వ్యక్తిని తీసుకుందాం. *"ముఖమే మనసుకు ప్రతిబింబం"* అనే సామెతకు తగ్గట్టుగా ఇతని ముఖంలో వేడి, అంధకారం, బరవు మరియు మనసులోని మలినాలు మొదలైన వికారాలు మన కంటికి స్పష్టంగా కనిపిస్తాయి. దాని ఫలితంగా తయారయ్యే ద్వేషంతో కూడిన మనోవృత్తులు సామాన్యంగా అథోఃలోకాలకు తీసుకెళతాయి. అలాగే లోభం మరియు మోహంకు సంబంధించిన చిత్తవృత్తులకు చెందిన తరంగాలు కూడా అథోఃగతి వైపుకే తీసుకెళ్లేవిగా ఉంటాయి. భక్తి, సదాచారం మరియు దానం వంటి పుణ్యకార్యాల ఆధారంగా తయారయిన మానసిక తరంగాలు సాధారణంగా దేవతలు, మానవులు ఉన్న కామలోకాలతో సమరసమవుతాయి.

ఓ సజ్జనులారా! ఇవే గౌతమ బుద్ధుని జీవిత చరిత్రను అర్థంచేసుకోవడానికి అవసరమయిన విషయాలు. ఇక ఇప్పుడు బుద్ధుని జీవిత చరిత్ర గురించి వివరిస్తాను.

## బుద్ధత్వం ప్రాప్తించుకోవడానికి పూర్వ ప్రయత్నం :

ఇప్పుడు నడుస్తున్న కల్పాన్ని భద్ద కప్ప (భద్రకల్పం) అంటారు. దీనిలో అయిదుగురు సమ్యక్ సంబుద్ధులు ఉత్పన్నమవుతారు. నిశ్చయమయిన ఈ వర్తమానకల్పం, భద్ర కల్పం. ఇందులో గౌతమ బుద్ధుడు నాలుగవ బుద్ధునిగ ఉద్భవించాడు. గౌతమ బుద్ధునికంటే ముందు భగవానులు **కకుసంధుడు, కోణాగమనుడు** మరియు **కాశ్యప బుద్ధులు** ఉద్భవించారు. ఈ కల్పానికంటే ముందు ఎన్నో కల్పాలలో లెక్కలేనంతమంది బుద్ధులు ఉత్పన్నమయ్యారు. ఈ బుద్ధులందరూ ఒకే ధర్మాన్ని బోధించారు. అన్ని ప్రాణులు దుఃఖంనుండి, మృత్యువునుండి విముక్తి పొందే ధర్మాన్నే బోధించారు. బుద్ధులందరూ ముక్తిపొంది, ఎంతో కరుణతో, ఎంతో తేజస్సుతో సర్వజ్ఞులై ఉంటారు.

ఎన్నో కల్పాలముందు ఒకానొక సమయంలో **దీపంకరుడు** అనే సమ్యక్ సంబుద్ధుడు ఉత్పన్నమయ్యాడు. ఆ సమయంలో అతనిని దర్శించుకొన్న **సుమేధుడు** అనే తాపస్వి, అతని నుండి ఎంతగానో ప్రభావితుడై, తాను కూడా భవిష్యత్తులో సమ్యక్ సంబోధిని సంప్రాప్తించుకోవాలని సంకల్పించుకున్నాడు. అందుకొరకు చేయాల్సిన కఠిన తపస్సు, సాధనలు చేస్తానని, ఎన్ని కష్టాలనైనా సహిస్తానని ఆయన తన దృఢసంకల్పాన్ని దీపంకరుని ముందు వెల్లడించి వారి ఆశీస్సులు కోరుకుంటాడు. దీపంకర బుద్ధుడు తాపస సుమేధుని ఈ శుభసంకల్పాన్ని తెలుసుకొని, నాలుగు అసంఖ్యాక కల్పాలు దాటి ఒక లక్ష కల్పాల తరువాత ఈ తాపస్వి "గౌతముడు" అనే పేరుతో సమ్యక్ సంబుద్ధుడవుతాడని భవిష్యవాణిని వినిపించాడు. దాని తరువాత సుమేధుడు బోధిసత్వునిగా (భావి బుద్ధుడు) తాను జన్మించిన అసంఖ్యాక జన్మలలో ప్రతి జన్మలోనూ అభ్యాసం చేస్తూ, చేస్తూ పది పారమితలను (పుణ్యకర్మలు) బలపరచుకుంటూ, బలపరచుకుంటూ అత్యుత్తమ చిత్తవృత్తులను సంగ్రహిచుకుంటూ ముందుకు సాగాడు.

**ఆ పది పారమితలు**

***1. దాన పారమీ 2. శీల పారమీ 3. నిష్క్రమణ పారమీ 4. ప్రజ్ఞా పారమీ 5. వీర్య పారమీ 6. క్షాంతి పారమీ 7. అధిష్ఠాన పారమీ 8. సత్య పారమీ 9. మైత్రీ పారమీ 10. ఉపేక్షా పారమీ***

ఈ విధంగా సంబోధిని పొందటమనేది అత్యంత కష్టసాధ్యమైన పని. దానిని పొందాలని ఆలోచించడానికి కూడా ఎంతో బలమైన మానసిక శక్తులు అవసరమవుతాయి.

బోధిసత్వుడు అసంఖ్యాక జన్మలలో అవసరమైన పారమితలను వృద్ధిచేసుకుంటూ, దానవీరుడైన మహారాజా వైసాంతరునిగా జన్మించినప్పుడు, ఆ పారమితలను సంపూర్ణంగా పూర్తిచేసుకున్నాడు. ఆ జన్మలో అతడు తన రాజ్యాన్ని, ధనసంపదలను, ఐశ్వర్యాన్ని ఆఖరికి తన భార్యాబిడ్డలను కూడా దానంగా ఇచ్చేశాడు. ఈ విధంగా అతడు అద్వితీయమైన దానమిచ్చాడు. ఇలా అతడు భగవాన్ దీపంకర బుద్ధుని వద్ద వెల్లడించిన సంకల్పాన్ని పూర్తిచేసుకున్నాడు. ఆ తరువాత బోధిసత్వుడు సేతకేతు దేవతగా తుషిత లోకంలో జన్మించి బుద్ధత్వాన్ని ప్రాప్తించుకోవడానికి తన అంతిమ జన్మ కోసం ఎదురు చూశాడు. సమయం ఆసన్నం కాగానే, అతడు తుషిత లోకాన్ని త్యజించి, కపిలవస్తు మహారాజైన శుద్ధోధనుని రాణి మహామాయ యొక్క గర్భంలో ఉద్భవించాడు. ప్రసవకాలం సమీపించగానే ప్రసూతికొరకు తన పుట్టింటికి వెళ్లాలనే కోరిక రాణిలో కలిగింది. రాణి కోరికను తీర్చడానికి శుద్ధోధన మహారాజు తగినంతమంది దాస-దాసీలు, రక్షకులతో రాణిని తన పుట్టింటికి పంపాడు. ఆ బృందం లుంబినీ వనంగుండా ప్రయాణం చేస్తున్నది. కొద్దిసేపు ఆ వనంలో విహరించాలని రాణి మహామాయ మనసులో కోరిక కలిగింది. దానితో ఆమె తన పల్లకీనుండి క్రిందకు దిగి, లుంబినీ వనంలోని సాల పుష్పాల రమణీయతను ఆస్వాదిస్తూ సాలవృక్షం క్రింద నిలబడి, పుష్పాలు తెంపాలని తన కుడిచేతితో ఒక కొమ్మను పట్టుకోగానే అకస్మాత్తుగా పుత్రజననం జరిగింది. ఆ పుత్రుడే ఆ తరువాత సమ్యక్ సంబుద్ధుడయ్యాడు. ఆ బాలుడు జన్మించగానే విశ్వంలో 32 రకాల అసాధారణ చమత్కారాలు జరిగాయి. భౌతిక ప్రపంచమంతా ప్రకంపించసాగింది. సౌరమండలం మునుపెన్నడూ లేనంత దైదీప్యమానంగా ప్రకాశించింది. పార్థివ జగత్తులోని ప్రాణులు ఒకరినొకరు చూసుకోగలిగారు. బధిరులు వినగలిగారు, మూగవారు మాట్లాడగలిగే శక్తిని పొందారు. అంతటా దుందుభులు మారు మ్రోగాయి...ఇలాంటి అద్భుతాలు ఎన్నో.

ఆ సమయంలో శుద్ధోధన మహారాజు యొక్క గురువు కాలదేవలుడు, తావతింస దేవలోకానికి వెళ్లి, అక్కడి దేవతలకు ఉపదేశమిస్తూ ఉన్నాడు. కాలదేవలుడు ఎనిమిది ధ్యానాలలో పారంగతుడై అతీంద్రియ శక్తులను ప్రోది చేసుకొని ఉన్నాడు. అతడు కామ-రూపలోకాల్లో అకస్మాత్తుగా

చోటుచేసుకొన్న ఈ ఆనందోత్సాహాలకు కారణం, శుద్ధోధన మహారాజుకి పుట్టిన పుత్రుడే అని తెలుసుకొని, వెనువెంటనే దేవలోకాన్ని వదలి శుద్ధోధనుడి అంతఃపురానికి చేరుకొని, ఆ బాలునికి ఆశీర్వాదం ఇవ్వడానికి పిలిపించాడు. మహారాజు ఆ బాలుడిని తన గురువు వద్దకు తీసుకురాగానే, ఆ పిల్లవాడే కాబోయే బుద్ధుడు అని రాజగురువు దేవలుడు వెంటనే గ్రహించాడు. ఇది తెలుసుకొని, అతడు అత్యంత ప్రసన్నుడయ్యాడు. కానీ మరుక్షణమే తన ఆయుష్షు కొంతే మిగిలి ఉందని తెలుసుకోగానే అతడు దుఃఖంతో ఏడవటం మొదలుపెట్టాడు. అతడు సమ్యక్ సంబుద్ధుడిని దర్శించుకోలేడు. అతని ఉపదేశాన్ని వినలేడు. ఎందుకంటే మృత్యువు తరువాత అతడు అరూప బ్రహ్మలోకంలో జన్మించనున్నాడు. అక్కడ జీవిస్తూ, ఈ భౌతిక జగత్తుతో సంపర్కం పెట్టుకోవడం అసంభవమైన కారణంగా అతడు దుఃఖించడం మొదలుపెట్టాడు. అతడు బుద్ధుని బోధనలను పొందలేకపోతున్నందుకు బాధతో కుమిలిపోసాగాడు.

అయిదవ రోజున బాలుడికి నామకరణ కార్యక్రమాన్ని నిర్వహించి అతనికి "సిద్ధార్థుడు" అనే పేరు పెట్టారు. ఆ వేడుకకు విచ్చేసిన జ్యోతిష్యులు, హస్తసాముద్రికా నిపుణులు ఆ బాలునిలో బుద్ధత్వం పొందటానికి కావలసిన లక్షణాలన్నీ పరిపుష్టిగా ఉన్నాయని చెప్పారు. ఇక ఏడవరోజు మాత మహామాయ మరణించారు. దానితో ఆ చిన్న రాజకుమారుడి ఆలనాపాలనా యొక్క బాధ్యత అతని పినతల్లి ప్రజాపతి గౌతమి చూసుకున్నది.

సిద్ధార్థ రాకుమారుని బాల్యం అంతఃపురంలో వైభవంగా గడచిపోయింది. అతడు అద్వితీయ బలశాలి, బుద్ధిమంతుడు కూడా. అతని జీవితం సుఖశాంతులతో నిండి ఉండేలా, ఎటువంటి లోటులేకుండా మహారాజు అన్ని సౌకర్యాలు కల్పించాడు. రాకుమారుడి కొరకు మూడు ఋతువులకు గాను మూడు అంతఃపురాలు కట్టించాడు. అతని విలాసంకొరకు కావలసిన సకల సౌకర్యాలు సమకూర్చాడు. రాకుమారుడు ఎల్లప్పుడూ ఇంద్రియభోగాలలో నిమగ్నమై ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు. మహారాజు తన పితృప్రేమ కొద్దీ తన కుమారుడు 'ప్రాపంచిక సుఖాన్ని అనుభవిస్తూ ఉండాలే తప్ప బుద్ధుడు కాకూడదు' అని భావించేవాడు.

శుద్ధోధన మహారాజు తన కుమారునిలో వైరాగ్యభావం కలగటానికి కారణమయ్యే ఏ విషయాన్నీ దరిచేరనిచ్చేవాడు కాదు. ముసలితనం, వ్యాధి మరియు మృత్యువుల గురించి రాకుమారుని వద్ద చర్చించవద్దని సేవకులు, మిత్రులందరికీ ఆదేశాలిచ్చాడు. దానితో 'ప్రపంచంలో దుఃఖమే లేదు' అనే భ్రమలో రాకుమారుని ఉంచాలనుకున్నాడు. ఈ విషయంలో రాజు ఎంతో అప్రమత్తంగా ఉండేవాడు. ఏ సేవకునిలోనైనా ముసలితనం లేదా వ్యాధి లక్షణాలు ఏ కొద్దిగా కనపడినా, వారిని వెంటనే మార్పించేవాడు. మరోవైపు ఆటపాటలతో కూడిన ఉల్లాసవంతమైన విందు-వినోదాలతో, మనోల్లాసమైన భోగవిలాసాలతో కూడిన వాతావరణంలో రాకుమారుడు నిమగ్నమై ఉండటానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేయించాడు.

*...తరువాయి భాగం వచ్చే సంచికలో*

*– సయాజీ ఊ బాఖిన్ జర్నల్ నుండి సంగ్రహించబడినది.*


**వెలువడింది**

**అధిక ప్రాచుర్యం పొందిన**
**శ్రీ గోయెంకా గారి జాగే అంతర్బోధ్**
**హిందీ పుస్తకానికి తెలుగు అనువాదం**

**అంతర్బోధ మేల్కొనుగాక**

**ఇప్పుడు అన్ని ధ్యాన కేంద్రాలలో అందుబాటులో ఉంది...**



రెండు సంవత్సరాలకు చందా రూ 100/- | విపశ్యన తెలుగు మాసపత్రిక | జీవిత చందా రూ. 500/-

ప్రచురణ తేది: ప్రతినెల 30/31 | పోష్టింగ్ తేది: ప్రతి నెల 1/2 | వెల: రూ 5/-

విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - 500 070.

ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**

If Undelivered please return to :


**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam.
Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.